సాక్షి
వికారాబాద్

శుక్రవారం । 19 । ఏప్రిల్ । 2024



సర్వే.. షురూ..

కొడంగల్ – నారాయణపేట ఎత్తిపోతల పథకం సర్వే పనులు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. 8లో▸



కనుల పండువగా..

జుంటుపల్లి రామచంద్రాస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 8లో▸



ప్యాకేజీ లీడర్స్!

ఎన్నికలు అంటేనే కొందరికి కలెక్షన్ల పండుగ. పోటీదారులు నువ్వానేనా అన్నట్లు ఉంటే అన్ని వైపుల నుంచి డబ్బేడబ్బు. 9లో▸

న్యూస్‌రీల్

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల



నోటిఫికేషన్ విడుదల చేస్తున్న తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులు

కొడంగల్: మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్‌ను గురువారం తహసీల్దార్ విజయ్‌కుమార్ విడుదల చేశారు. ఎన్నికలకు సంబంధించిన విధి విధానాలను రూపొందించిన ప్రతిని నోటీసు బోర్డుపై అంటించారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆసక్తి ఉన్నవారు పూర్తి సమాచారాన్ని తెలుసుకొని నామినేషన్ వేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నర్సింలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తరుణ్‌కు ఘన సన్మానం



తరుణ్‌ని సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ అంజయ్య

రాజేంద్రనగర్: యూపీఎస్సీ ప్రకటించిన ఫలితాల్లో ఆల్ ఇండియా స్థాయిలో 231వ ర్యాంక్ సాధించి ఐఏఎస్‌కి ఎంపికైన తరుణ్‌ను రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎర్ర అంజయ్య గురువారం ఘనంగా సన్మానించారు. కళాశాల సిబ్బందితో కలసి మంచినిపల్లికి వెళ్లి తరుణ్ తోపాటు వారి తల్లిదండ్రులను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం మంచినిపల్లికి చెందిన తరుణ్ ఒకటి నుంచి 10వ తరగతి వరకు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదివారని తెలిపారు. 2017 – 19లో రాజేంద్రనగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసినట్లు తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన తరుణ్ ప్రభుత్వ కళాశాలలో చదివి మొదటి ప్రయత్నంలోనే అత్యుత్తమ ర్యాంక్ సాధించడం చాలా గొప్ప విషయమన్నారు. ఇది ప్రభుత్వ కళాశాలల్లో చదివే ఎంతో మంది విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది మాన్య, కిరణ్‌కుమార్, చంద్రశేఖర్, మురళీ, పార్థసారథి, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రమేష్‌కుమార్



తాండూరు: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పెద్దేముల్ మండలం సర్పాపూర్‌కు చెందిన రమేష్‌కుమార్ నియమితులయ్యారు. గురువారం ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తోపాటు రాష్ట్ర నేతలను కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ చేవెళ్ల అభ్యర్థి విజయానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

బీజేపీలో చేరిన నరేందర్‌రెడ్డి



బీజేపీలో చేరుతున్న నరేందర్‌రెడ్డి

తాండూరు రూరల్: బీఆర్‌ఎస్ నాయకుడు, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు గౌతాపూర్ ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి గురువారం బీజేపీలో చేరారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో నగరంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అంతకు ముందు ఆయన బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. నరేందర్‌రెడ్డి గతంలో గౌతాపూర్ సర్పంచ్‌గా కూడా పని చేశారు. తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డికి ముఖ్య అనుచరుడిగా ఉన్నారు.

చేసేదే చెబుతా | చెప్పింది చేస్తా



‘నేనేమీ ఆస్తులు కూడబెట్టేందుకో.. అధికారాన్ని అనుభవించేందుకో.. రాజకీయాల్లోకి రాలేదు. పుట్టిన గడ్డ రుణం తీర్చుకునేందుకు, చేవెళ్ల ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చాను. ఎన్నికల్లో గెలుపు కోసం అమలుకు సాధ్యం కాని హామీలు ఇవ్వను. కాంగ్రెస్ పార్టీ నాయకుల్లా ఝూటా మాటలు చెప్పను. నా వ్యక్తిత్వాన్ని దెబ్బతీసుకోలేను. ఏది ఆచరణ సాధ్యమో ఆయా అంశాలపై మాత్రమే హామీలు ఇస్తాను. బీజేపీ సిద్ధాంతాలను, మోదీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తా. మోదీ బొమ్మను చూపించి ఆశీర్వదించాల్సిందిగా అభ్యర్థిస్తా. ప్రజా ఆశీర్వాద యాత్ర పేరుతో ఇటీవలే ప్రజల్లోకి వెళ్లాను. నామినేషన్ తర్వాత ప్రచారాన్ని మరింత ముమ్మరం చేస్తా. చేవెళ్ల లోక్‌సభ పరిధిలో ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా, ఇతర పార్టీ పెద్దలతో రోడ్ షోకు ప్లాన్ చేస్తున్నా. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్‌ఎస్ సంస్థాగతంగా బలహీనపడింది. కాంగ్రెస్‌తోనే ప్రధాన పోటీ ఉండబోతోంది’ అని బీజేపీ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.

– సాక్షి, రంగారెడ్డిజిల్లా

ఝూటా మాటలు చెప్పను

- వ్యక్తిత్వాన్ని దెబ్బతీసుకోను
- కాంగ్రెస్‌తోనే ప్రధాన పోటీ
- అడ్డగోలు హామీలు ఇవ్వను
- తుదిశ్వాస వరకూ మోదీతోనే..
- చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

ప్రచారం ఎలా కొనసాగుతోంది. ప్రజల నుంచి స్పందన ఎలా ఉంది?

కొండా: ప్రజా ఆశీర్వాద యాత్ర పేరుతో ఇప్పటికే 370 గ్రామాల్లో పర్యటించా. ఆయా గ్రామాల్లో యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అర్బన్ ఏరియాల్లోనే కాకుండా రూరల్ ప్రాంతాల్లోనూ బీజేపీ గాలి వీస్తోంది. ప్రజలకు మోదీ ప్రభుత్వంపై విశ్వాసం పెరిగింది. మోదీ విధానాలు నచ్చి ఇతర పార్టీలకు చెందిన కార్యకర్తలు 3 వేల మందికి పైగా బీజేపీలో చేరారు.

ఏ పార్టీ నుంచి ప్రధాన పోటీ ఉంటుందని భావిస్తున్నారు?

కొండా: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి తర్వాత సంస్థాగతంగా బలహీనంగా మారింది. ఆ పార్టీ అభ్యర్థికి ముదిరాజ్ సమాజంలో మంచి గుర్తింపు ఉంది. కాంగ్రెస్ అభ్యర్థి చేస్తున్న చిల్లర కామెంట్లు మళ్లీ అ పార్టీ గ్రాఫ్‌ను పెంచుతున్నాయి. ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్‌తోనే ప్రధానంగా పోటీ ఉండబోతోంది. పట్టణ ప్రాంతాల్లోనే కాదు.. గ్రామీణ ప్రాంతాల్లోనూ మోదీ వేవ్ కొనసాగుతోంది. కాంగ్రెస్ అభ్యర్థిలా ఝూటా మాటలు నేను మాట్లాడను. అమలు సాధ్యం కానీ హామీలు ఇవ్వను. కల్లబొల్లి మాటలతో ప్రజలను మోసం చేయను. రాజకీయాల్లో ఉన్నంత కాలం నిజాయితీగా నిబద్ధతతో పని చేస్తా.

మైనార్టీల ఓట్లు మీకు పడే అవకాశం ఉందంటారా?

కొండా: కాంగ్రెస్ అభ్యర్థి పూర్తిగా ముస్లిం మైనార్టీ ఓట్లపైనే ఆధారపడుతున్నారు. ముస్లిం, క్రిస్టియన్ ఓటర్లు ఆరు లక్షల వరకు ఉంటారు. బీజేపీ ఆయా వర్గాలకు ఏమాత్రం వ్యతిరేకం కాదు. త్రిపుల్ తలాక్ రద్దుతో ముస్లిం మహిళల్లో మోదీపై గౌరవం పెరిగింది. ఈశాన్య రాష్ట్రాల్లోని మెజార్టీ క్రిస్టియన్లు బీజేపీతోనే ఉన్నారు. మాపై మతతత్వ ముద్ర వేసి..వాళ్లు మాత్రం మతం పేరుతో గెలుపొందాలనుకుంటున్నారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రజల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. రాజకీయ అవసరానికి ప్రజల ప్రాణాలను ఫణంగా పెట్టొద్దు. ఇది దేశానికి మంచిది కాదు.

తరచూ పార్టీలు మారతారనే అపవాదు మీపై ఉంది. దీనికి మీ సమాధానం?

కొండా: పైరవీల కోసమో, ఆస్తులు కూడబెట్టేందుకో? నేను రాజకీయాల్లోకి రాలేదు. చేవెళ్ల ప్రజలకు మంచి చేయాలనే ఏకైక లక్ష్యంతోనే వచ్చాను. మొదట్లో బీఆర్‌ఎస్ విధానాలు నచ్చి ఆ పార్టీలో చేరాను. ఏ నినాదం పేరుతో అధికారంలోకి వచ్చిందో.. ఆ తర్వాత వాటిని మర్చిపోయింది. పార్టీ అధినేత వైఖరిలోనూ మార్పు వచ్చింది. తెలంగాణ ప్రజలకు మంచి కన్నా చెడే ఎక్కువ జరుగుతుండటం, ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాకపోవడంతో ఆ పార్టీని వీడాల్సి వచ్చింది. ఆ తర్వాత బీఆర్‌ఎస్‌కు బలమైన పార్టీ కాంగ్రెస్ అని భావించి, ఆ పార్టీలో చేరాను. కాంగ్రెస్ కూడా బీఆర్‌ఎస్‌కు అమ్ముడుపోయింది. దీంతో నేను మరో ప్రత్యామ్నాయాన్ని వెతుక్కోవాల్సి వచ్చింది. మోదీ విధానాలు.. దేశ అంతర్గత భద్రత, అభివృద్ధి కోసం ఆయన పడుతున్న తపనకు ఫిదా అయ్యాను. బీజేపీలో చేరాను. చివరి శ్వాస వరకు ఇదే పార్టీలో కొనసాగుతా.

111 జీఓ, కందిబోర్డు, జీఎస్టీ రద్దు, శాటిలైట్ సిటీ సమస్యలు ఎలా పరిష్కరిస్తారు?


కొండా: నేను ఎంపీగా ఉన్నప్పుడే రూ.930 కోట్లతో బీజాపూర్ రోడ్డును మంజూరు చేయించా. రాజకీయ, రియల్ ఎస్టేట్ అవసరాల కోసం ఈ పనులను అడ్డుకున్నారు. కందిబోర్డు ఏర్పాటు కన్నా.. రైతులు పండించిన కందులకు మద్దతు ధర కల్పన, పరిశోధనలకు ప్రాధాన్యం కల్పిస్తా. వికారాబాద్‌లో శాటిలైట్ సిటీ ఏర్పాటు చేయాలని గతంలో కేంద్రానికి లేఖ రాశాను. కనెక్టివిటీ కోసం ఇప్పటికే మన్నెగూడ రోడ్డును మంజూరు చేయించాను. ఎంపీగా గెలుపొందిన తర్వాత రోడ్డు విస్తరణ పనులు, శాటిలైట్ సిటీ ఏర్పాటు పనులు పూర్తి చేయిస్తా. హైదరాబాద్- ముంబై బుల్లెట్ ట్రైన్ సర్వే మొదలైంది. వికారాబాద్ తొలి స్టాప్ ఏర్పాటు చేశారు. ఎంఎంటీఎస్ మంజూరు చేయిస్తే.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిధుల లేమితో చేతులెత్తేసింది. తాండూరులోని నాపరాతి పరిశ్రమకు జీఎస్టీ 18 శాతం నుంచి ఐదు శాతానికి తగ్గించా. నాపరాయి వ్యర్థాలతో వెలువడే కాలుష్యాన్ని నియంత్రించేందుకు సిమెంట్ పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తా. 111 జీఓ రద్దు కోసం తొలి లేఖ రాశాను. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆ జీఓను రద్దు చేస్తున్నట్లు ప్రకటించి, దాని స్థానంలో ఉల్టాపల్టా జీవో 69 తీసుకొచ్చింది.

అపాయింట్‌మెంట్ లేనిదే ఎవరినీ కలవరనే అపవాదు ఉంది. దీనికి మీ సమాధానం?

కొండా: అపాయింట్‌మెంట్ తీసుకుని రావాలనే ప్రచారం తప్పు. నిత్యం ప్రజల మధ్యే ఉంటాను. ఎవరూ వచ్చినా కలుస్తాను. ఆపదలో వచ్చిన వారికి అండగా నిలుస్తున్నా. కోవిడ్ సమయంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేశాను. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులే కాదు సామాన్యులు సైతం నేరుగా వచ్చి కలవొచ్చు. చేవెళ్ల అభివృద్ధే లక్ష్యంగా నామినేషన్ రోజు ప్రత్యేక మేనిఫెస్టో విడుదల చేస్తా.

నీటి సమస్య రానివ్వం

- వేసవి దృష్ట్యా ముందస్తు ఏర్పాట్లు
- అవసరాలకు సరిపడా మిషన్ భగీరథ నీళ్లు
- ‘సాక్షి’తో కలెక్టర్ నారాయణరెడ్డి



కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్: వేసవిలో జిల్లా ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుత జనాభాకు సరిపడా నీళ్లు అందుబాటులో ఉన్నాయి. మంచినీటి పథకాలు పాడైతే తప్ప నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. అప్పుడు కూడా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రణాళికలు సిద్ధం చేసినట్లు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆయన ‘సాక్షి’తో మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న నీటి లభ్యత, తాగునీటి సమస్యల తలెత్తకుండా ఉండేందుకు తీసుకుంటున్న చర్యలు.. ముందస్తు ప్రణాళికలు.. తదితర అంశాలపై చర్చించారు. ప్రజలతో పాటు పశు పక్షాదుల దాహార్తిని తీర్చేందుకు యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను వివరించారు.

నిధుల కొరత లేదు

వేసవిలో తాగునీటి సరఫరా, మరమ్మతులకు నిధుల కొరత లేదు. రూ.3.5 కోట్ల ఎస్‌డీఎఫ్, రూ. 6.5 హెచ్‌డీఎఫ్‌సీ నిధులు, రూ. 1.5 15వ, ఆర్థిక సంఘం నిధులు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరులు, వ్యవస్థలను సమర్థవంతగా వినియోగించుకోవటంతో పాటు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం. పైప్‌లైన్ లీకేజీలు, బోర్ వెల్స్, బోరు పంపులు లాంటివి పాడైతే 24 గంటల్లో బాగు చేయించి అందుబాటులోకి తెచ్చేలా సిబ్బందిని ఆదేశించాం. ప్రస్తుతం జిల్లాలో 1,044 బోరు పంపు సెట్లకు మరమ్మతులు చేయించాం. మరో 475 బోర్ బావులను సైతం బాగు చేశాం. అనుకోని సమస్య తలెత్తినా వారం రోజుల పాటు జిల్లా వాసుల తాగునీటికి ఇబ్బంది లేకుండా పక్కా ప్లానింగ్ చేశాం. ఇందుకోసం తాండూరు సమీపంలోని కాగ్నా నదిలో 100 హెచ్‌పీ సామర్థ్యంతో ఒకటి, 80 హెచ్‌పీ సామర్థ్యంతో మరొక పంపును సిద్ధంగా ఉంచాం. ఇవి ఒక్కొక్కటి రోజుకు 2.5 ఎంఎల్‌డీ సామర్థ్యంతో రెండు కలిపి 5 ఎంఎల్‌డీ నీటిని పంపింగ్ చేస్తాయి. వీటితోపాటు యాలాల మండలంలోని తొమ్మిది గ్రామాలకు, కొడంగల్ మున్సిపాలిటీకి, మండలంలోని గ్రామాలకు, తాండూరు మున్సిపాలిటీకి సరిపడా నీటిని సరఫరా చేయటానికి వీలుంటుంది. ముందస్తు చర్యల్లో భాగంగా మరో 5 ఎంఎల్‌డీ వాటర్ పంపింగ్ చేసేందుకు అవసరమైన ఏర్పాట్ల కోసం కూడా ప్రతిపాదనలు పంపాం.

పశు పక్ష్యాదులకు కూడా..

ప్రజలతో పాటు పశు పక్ష్యాదులకు కూడా తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నాం. జిల్లాలో ఇప్పటికే 432 గ్రామ పంచాయతీల్లో పశువుల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్లను అందుబాటులోకి తేచ్చాం. వాటిని నింపాలని క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. కొన్ని గ్రామాల్లో మంచినీటి పథకాలకు చిన్నచిన్న మరమ్మతులు ఉంటే వెంటనే బాగు చేయాలని చెప్పాం. ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న ప్రదేశంలో కూలీలకు నీటి వసతి కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించాం. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నాం. మధ్యాహ్నం 12 గంటలలోపు కూలీలు ఇంటికి చేరేలా చూస్తున్నాం.

అందుబాటులో 145ఎంఎల్‌డీ నీరు

జిల్లాలో రెండు చోట్ల నీటి శుద్ధి కేంద్రాలు ఉన్నాయి. ఒకటి పరిగి మండలం జాఫర్‌పల్లి సమీపంలో.. ఈ ప్లాంటు రోజుకు 135 ఎంఎల్‌డీ నీటిని శుద్ధి చేసి పంపింగ్ చేసే సామర్థ్యం ఉంది. రెండోది కొడంగల్‌లో 17 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన నీటి శుద్ధి కేంద్రం అందుబాటులో ఉంది. ఇప్పటి వరకు రోజుకు 18 గంటలకు నీటిని శుద్ధి చేయించాం. వేసవి దృష్ట్యా రోజుకు 22 గంటలు నీటిని శుద్ధి చేసేలా ఏర్పాట్లు చేశాం. జిల్లాలో సుమారు పది లక్షల జనాభా ఉంది. వీరి రోజు వారి అవసరాలకు 130 ఎంఎల్‌డీ నీరు అవసరం అవుతాయి. ప్రస్తుతం రోజుకు రెండు వాటర్ ప్లాంట్లలో 145 ఎంఎల్‌డీ నీటిని పంపింగ్ చేస్తున్నాం. తాగునీటి సమస్య తలెత్తకుండా నిత్యం పర్యవేక్షించడం తోపాటు సంబంధిత అధికారులను అప్రమత్తం చేస్తున్నాం.

‘సీ విజిల్’లో ఫిర్యాదు చేయండి

- వంద నిమిషాల్లో సమస్యను పరిష్కరిస్తాం
- ఎంపీ అభ్యర్థులు రాజేంద్రనగర్‌లో నామినేషన్లు సమర్పించాలి
- తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

తాండూరు టౌన్: ఎన్నికల నియమావళి ఉల్లంఘనులపై సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేస్తే, వంద నిమిషాల్లో అట్టి సమస్యను పరిష్కరిస్తామని తాండూరు అసెంబ్లీ సెగ్మెంట్ సహాయ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ శ్రీనివాస్‌రావు తెలిపారు. గురువారం ఆయన పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమావేశమయ్యారు. సీ విజిల్ యాప్ అనేది తక్షణ సమస్య పరిష్కారం కోసం ఎన్నికల కమిషన్ అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఇట్టి యాప్‌ను ఫిర్యాదుల కోసం ఉపయోగించుకోవచ్చని సూచించారు. డబ్బు, మద్యం తరలింపును అరికట్టడం కోసం పలు టీంలు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. రసీదు లేకుండా రూ. 50వేలకు మించి నగదు తరలిస్తే సీజ్ చేస్తామన్నారు. ఎన్నికల సభలు, వాహన అనుమతికి సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పోలీసు అధికారుల నివేదిక తీసుకున్న తరువాత అనుమతి ఇస్తామన్నారు. స్థానిక టీవీ, యూట్యూబ్ చానళ్లు రాజకీయ పార్టీల ప్రకటనలను ప్రసారం చేయరాదన్నారు. ఎంపీ అభ్యర్థులు అనుమతి తీసుకొని, సరైన ధ్రువీకరణ పత్రాలను సమర్పించిన ప్రకటనలను మాత్రమే ప్రసారం చేయాలని ఆదేశించారు. లేకుంటే అట్టి చానళ్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నేటి నుంచి (గురువారం) నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైందని, ఎంపీగా పోటీ చేసే అభ్యర్థులు రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను సమర్పించాలని సూచించారు. ఏప్రిల్ 25వ తేదీతో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగుస్తుందని, 26న పరిశీలన, 29న ఉపసంహరణ ఉంటుందన్నారు. మే 13న పోలింగ్ జరుగుతుందని, అర్హులందరూ ఓటు వేసేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్లు తారాసింగ్, మునీరుద్దీన్, వెంకటేష్, ఎన్నికల డీటీ లలిత, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

బీఆర్‌ఎస్ అభ్యర్థులకు బీ ఫాంలు





కాసాని జ్ఞానేశ్వర్‌కు, క్యామ మల్లేశ్‌కు బీఫాంలు అందజేస్తున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ గురువారం ఆ పార్టీ కార్యాలయంలో చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు బీఫాం అందజేశారు. ఆయన వెంట మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఎమ్మెల్సీలు దయానంద్‌గుప్తా, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్వర్‌రెడ్డి, పైలెట్ రోహిత్‌రెడ్డి, మెతుకు ఆనంద్ ఉన్నారు.

భువనగిరి ఎంపీ అభ్యర్థికి..

ఇబ్రహీంపట్నం రూరల్: బీఆర్‌ఎస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌కు ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం పార్టీ బీఫాంను అందజేశారు. అలాగే ఎన్నికల ఖర్చుల నిమిత్తం రూ.98 లక్షల చెక్కును అందించారు. బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ బాగుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఇన్‌చార్జి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

చిలుకూరు బాలాజీ ఆలయంలో ప్రత్యేక పూజలు

మొయినాబాద్: కలియుగదైవం చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలు గురువారం రాత్రి ప్రారంభమయ్యాయి. వారం రోజులపాటు కొనసాగే బ్రహ్మోత్సవాలకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అంకురార్పణ చేశారు. ఆలయ ప్రధాన మండపంలో స్వామివారు, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మొదట సెల్వర్ కూత్తు నిర్వహించి.. వేద మంత్రోశ్చరణతో దేవాలయాన్ని శుద్ధి చేశారు. అనంతరం పుట్ట బంగారం (పుట్టమన్ను) తీసుకొచ్చి హోమగుండాలు ఏర్పాటు చేశారు. అందులో నవధాన్యాలు, పాలికలు కలిపి హోమాలను వెలిగించారు. తరువాత విష్వక్సేనుడి ఆరాధన, పుణ్యాహవచన కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ ప్రాంగణంలో ఊరేగించిన అనంతరం యజ్ఞం చేపట్టారు. రాత్రి 7 గంటలకు ప్రారంభమైన కార్యక్రమాలు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. పూజా కార్యక్రమాలు తిరుమల కిరణాచారి, పరావస్తు రమాచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ కమిటీ చైర్మన్ సౌందరరాజన్, కన్వీనర్ గోపాల కృష్ణస్వామి పాల్గొన్నారు. రర

దేశంలో కమల వికాసం తథ్యం



సాల్వీడు గ్రామంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ నేతలు

మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యారెడ్డి

కుల్కచర్ల: ప్రధాని మోదీ నాయకత్వంలో కమల వికాసం తథ్యమని మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పీ సౌమ్యారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సాల్వీడు గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అవినీతిరహిత పాలన, ప్రజాస్వామ్య పాలన బీజేపీతోనే సాధ్యమని అన్నారు. నిరుపేదలు, బడుగుబలహీన వర్గాల అభ్యున్నతికి మోదీ ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. అధికారం కోసం పార్టీలు మారే వ్యక్తులకు ఓట్లు వేయరాదని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు మైపాల్, బీజేవైఎం మండల అధ్యక్షుడు జీ మైపాల్, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి హన్మంతు, నర్సింహారెడ్డి, నాయకులు మైపాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా విధులు నిర్వహించాలి

అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనందున అధికారులు పకడ్బందీగా విధులు నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ సూచించారు. గురువారం వికారాబాద్ నియోజకవర్గానికి సంబంధించి ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని పరిశీలించారు. ఎన్నికల సిబ్బంది ఇక్కడి నుంచే విధులు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను, జిల్లాకు సంబంధించి పట్టణంలోని నందు మేరినాట్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, తహసీల్దారు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ

క్లుప్తంగా

అనారోగ్య కూలీలను 'ఉపాధి'కి తీసుకోవద్దు

కలెక్టర్‌ సి.నారాయణరెడ్డి



అనంతగిరి: వేసవిని దృష్టిలో ఉంచుకొని ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులకు అనారోగ్యంతో ఉన్న కూలీలను తీసుకోవద్దని కలెక్టర్‌ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన టెలీ కాన్ఫరెన్సులో అధికారులతో మాట్లాడుతూ.. జిల్లాలో పార్లమెంటు ఎన్నికల సందర్భంగా గెజిట్‌ నోటిఫికేషన్‌ ప్రతిని ఆర్డీఓ, తహసీల్దార్‌, ఎంపీడీఓ, ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయం నందు ప్రదర్శించాలని సూచించారు. గ్రామాల్లో వ్యవసాయ పొలాలకు వెళ్లే రోడ్లను బాగు చేయడం, ముళ్ల పొదలు తొలగించడం, నీటి పొదుపునకు సంబంధించిన పనులకు సంబంధించి ఎఫ్‌టీఓ విడుదల చేయాలన్నారు. ప్రణాళిక ప్రకారం పనులు చేస్తే లక్ష్యం చేరుకోవచ్చన్నారు. కాన్ఫరెన్సులో డీఆర్‌డీఏ శ్రీనివాస్‌, డీపీఓ జయసుధ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక డంప్‌ చేస్తే చర్యలు

తహసీల్దార్‌ పురుషోత్తం



దిర్సంపల్లిలో ఇసుక డంప్‌ను సీజ్‌ చేసిన రెవెన్యూ అధికారులు

దోమ: అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌ను రెవెన్యూ అధికారులు సీజ్‌ చేశారు. గురువారం దిర్సంపల్లి గ్రామ సమీపంలోని ఓ రైతు పొలంలో అక్రమంగా 10 నుంచి 15 ట్రాక్టర్ల ఇసుకను నిల్వ ఉంచినట్లు రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు తహసీల్దార్‌ పురుషోత్తం ఆర్‌ఐ సుదర్శన్‌తో కలిసి డంప్‌ చేసిన ప్రాంతానికి పోలీసులతో వెళ్లారు. ఇసుకను గ్రామ సమీపంలోని వాగు నుంచి అక్రమంగా తీసుకువచ్చి డంప్‌ చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. అట్టి ఇసుకను సీజ్‌ చేసినట్లు తహసీల్దార్‌ తెలిపారు. అక్రమంగా ఇసుక తరలించిన, డంప్‌ చేసిన కేసులు నమోదు చేసి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధం



కాలిపోయిన గడ్డివాము

కుల్కచర్ల: ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైన సంఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తిర్మలాపూర్‌ గ్రామానికి చెందిన మధుకర్‌గౌడ్‌కు చెందిన గడ్డివాములో గురువారం మధ్యాహ్నం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. క్షణాల్లో పూర్తిగా గడ్డివాము ఆహుతయింది. సుమారు రూ.30 వేల విలువచేసే గడ్డి అగ్నికి బూడిద అయిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

వసూళ్లకు పాల్పడితే చర్యలు

ఎన్‌ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ అంకిత్‌ అనురాగ్‌



తాండూరు టౌన్‌: ఎన్‌ఎస్‌యూఐ పేరు చెప్పి ప్రైవేటు విద్యా సంస్థల వద్ద వసూళ్లకు పాల్పడే వారిపై చర్యలు తప్పవని ఆ సంస్థ జిల్లా వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ అంకిత్‌ అనురాగ్‌ గురువారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఇటీవల కొందరు వ్యక్తులు ఎన్‌ఎస్‌యూఐ పేరు చెప్పి తాండూరులోని పలు ప్రైవేటు పాఠశాల, కళాశాలల యాజమాన్యాన్ని దౌర్జన్యంగా డబ్బులు డిమాండ్‌ చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారిపై తీవ్ర చర్యలు ఉంటాయన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల వల్ల విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని, అలాంటి సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామన్నారు.

తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేక..

కుమార్తె ఆత్మహత్య

జగద్గిరిగుట్ట: తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేక కుమార్తె ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన జగద్గిరిగుట్ట ఠాణా పరిధిలో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. విజయనగర్‌ కాలనీ, ప్రేమ్‌ సరోవర్‌ అపార్ట్‌మెంట్స్‌లో శ్రీదేవి తన కుమార్తె వైష్ణవి(20)తో కలిసి నివాసం ఉంటోంది. భర్త సూర్యారావు మూడేళ్ల క్రితం మృతి చెందాడు. వైష్ణవి బీటెక్‌ మూడవ సంవత్సరం చదువుతోంది. తండ్రి లేని జీవితం తనకు అక్కర్లేదని, తాను చనిపోతానని పలుమార్లు తల్లితో చెప్పింది. ఈ నెల 17న తల్లి శ్రీదేవి బయటికి వెళ్లగా ఇంట్లో ఒంటరిగా ఉన్న వైష్ణవి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. 'ఐ యామ్‌ సారీ.. నాకు నాన్న కావాలి'అని సూసైడ్‌ నోట్‌ పేర్కొంది. కేసు దర్యాప్తులో ఉంది.

సర్వే.. షురూ..



సర్వే కోసం కొడంగల్‌కు వచ్చిన హెలికాప్టర్‌

కొడంగల్‌ - నారాయణపేట ఎత్తిపోతలకు లైడార్‌ సర్వే

- రూ.18 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- పథకం అమలుకు రూ.2,945 కోట్లు
- 1.05 లక్షల ఎకరాలకు సాగునీరు

కొడంగల్‌: కొడంగల్‌ – నారాయణపేట ఎత్తిపోతల పథకం సర్వే పనులు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. హెలికాప్టర్‌ ద్వారా లైడార్‌ సర్వే చేస్తున్నారు. వారం రోజుల పాటు కొడంగల్‌, నారాయణపేట, మక్తల్‌ నియోజకవర్గాల్లో సర్వే కొనసాగనుంది. ఇందుకోసం ప్రభుత్వం రూ.18 కోట్లు మంజూరు చేసినట్లు అధికారిక వర్గాల ద్వారా తెలిసింది. తెలంగాణ ఏర్పాటు కాకముందు ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్‌ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కోసం జీఓ నంబర్‌ 69 విడుదల చేసింది. అప్పట్లో రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ అనిశ్చితి కారణంగా పనుల్లో జాప్యం జరిగింది. 2014లో తెలంగాణ ఏర్పడి టీఆర్‌ఎస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో జీఓ 69 పక్కన పెట్టారు. 2023లో కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి రావడం, కొడంగల్‌ నుంచి విజయం సాధించిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో పాత జీఓ 69కు జీవం పోశారు. ఎత్తిపోతల పథకానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు. సర్వే పనులకు రూ.18 కోట్లు విడుదల చేశారు. పథకం పూర్తి చేసేందుకు రూ.2,945 కోట్లతో అనుమతి ఇచ్చారు. అధికారులు సర్వే పనులను వేగంగా నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు గ్రౌండ్‌ లెవల్‌లో కాల్వల తవ్వకం, పొలాలకు సాగునీరు అందించే విధానంపై సర్వే చేశారు. తాజాగా హెలికాప్టర్‌ ద్వారా లైడార్‌ సర్వే చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం హెలికాప్టర్‌ కొడంగల్‌కు వచ్చింది.

లక్షా 5వేల ఎకరాలకు సాగునీరు

కొడంగల్‌, నారాయణపేట, మక్తల్‌ నియోజకవర్గాల్లోని 1.05 ఎకరాలకు సాగునీరు, 5.50 లక్షల మందికి తాగునీరు అందించాలని కాంగ్రెస్‌ ప్రభుత్వం నిర్ణయించింది. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా కొడంగల్‌కు సాగునీరు రాదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భావిస్తున్నారు. కొడంగల్‌కు మూడు వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీశైలం నుంచి ఈ ప్రాంతానికి సాగునీరు రావడం ఆచరణ సాధ్యం కాదని, కొడంగల్‌ నారాయణపేట ఎత్తిపోతల పథకం జలసాధన సమితి సభ్యులు చెబుతున్నారు. రేవంత్‌రెడ్డి కొడంగల్‌ ఎమ్మెల్యేగా ఉన్న 2014 నుంచి 2018 వరకు పలుమార్లు ఈ పథకాన్ని అమలు చేయాలని టీఆర్‌ఎస్‌ ప్రభుత్వంపై పోరాటం చేశారు. ఆయన ముఖ్యమంత్రి కావడంతో ప్రాజెక్టు పనులకు శ్రీకారం చుట్టారు.



పాలమూరు జిల్లాలోని జూరాల ప్రాజెక్టు

నాలుగు రిజర్వాయర్లు

మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల మీదుగా ప్రవహించే కృష్ణానది తెలంగాణలోని నారాయణపేట జిల్లా కృష్ణా మండలంలో ప్రవేశిస్తుంది. కృష్ణానదిపై తెలంగాణలో తొలి ప్రాజెక్టు జూరాలను నిర్మించారు. జూరాల నుంచి నికర జలాలతో మూడు నియోజకవర్గాలకు సాగు, తాగునీరు ఇవ్వాలని ఇంజనీర్లు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. బూత్‌పూర్‌ రిజర్వాయర్‌ నుంచి నాలుగు దశల్లో ఎత్తిపోతల ద్వారా సాగు నీరు సరఫరా చేయనున్నారు. ఊట్కూర్‌, జాజాపూర్‌, జయమ్మ చెరువు, కానుకుర్తి వద్ద వీటిని నిర్మిస్తారు. అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా ఊట్కూర్‌, జాజాపూర్‌, జయమ్మ చెరువు, కానుకుర్తి, లక్ష్మీపూర్‌, ఈర్లపల్లి, దౌల్తాబాద్‌, హస్నాబాద్‌, కొడంగల్‌, బొంరాస్‌పేట చెరువులను కాకరవాణి ప్రాజెక్టును నింపి ఆయకట్టు భూములకు సాగునీరు వదులుతారు.

'ప్రైవేట్‌'లో కనిపిస్తే కఠిన చర్యలు

ఓపీ సేవలు తగ్గడంపై డీసీహెచ్‌ఎస్‌ డాక్టర్‌ ప్రదీప్‌ సీరియస్‌

సాక్షి ఎఫెక్ట్‌..

తాండూరు: ఆస్పత్రిలో విధులు నిర్వహించే వైద్యులు ప్రైవేట్‌ క్లినిక్‌లలో సేవలందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీసీహెచ్‌ఎస్‌ డాక్టర్‌ ప్రదీప్‌ హెచ్చరించారు. బుధవారం సాక్షి దినపత్రికలో 'సేవలన్నీ ప్రైవేట్‌కే!' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు గురువారం తాండూరులోని జిల్లా ఆస్పత్రిని డీసీహెచ్‌ఎస్‌ ప్రదీప్‌ తనిఖీ చేశారు. ఆస్పత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది అటెండెన్స్‌ రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం రోజూ అవుట్‌ పేషంట్‌ ఎంత మంది వస్తున్నారని తెలుసుకునేందుకు రికార్డులను తిరగేశారు. గతంలో కంటే ఓపీ సేవలు తగ్గిపోవడంతో సూపరింటెండెంట్‌ కేవీఎస్‌.మూర్తిపై అసహనం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. డ్యూటీ సమయంలో ప్రైవేట్‌ క్లినిక్‌లో కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదాలు జరిగి ఆస్పత్రికి వస్తే సత్వర వైద్యం



వైద్యులతో మాట్లాడుతున్న డాక్టర్‌ ప్రదీప్‌

అందించేందుకు ఆర్థో వైద్యులు డ్యూటీలో ఉండాలని అన్నారు. శస్త్ర చికిత్సల కోసం ఆస్పత్రికి వస్తే వారికి ఆపరేషన్‌ చేసి పంపించాలని సూచించారు. అలా కాకుండా సొంత క్లినిక్‌లకు పిలిపించుకోవడం మానుకోవాలని హితబోధ చేశారు. అనంతరం హైదరాబాద్‌ రోడ్డులో ఉన్న మాతా శిశు ఆస్పత్రిని ఆయన సందర్శించారు. ఆస్పత్రిలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. సిజేరియన్‌లు సరిగా చేయక గర్భిణులు పడుతున్న ఇబ్బందులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిపై సమగ్ర నివేదికను సిద్ధం చేసి కలెక్టర్‌కు సమర్పిస్తానని ఆయన తెలిపారు.

ఉద్యోగం వచ్చిందని.. డబ్బులు కాజేశారు

పూడూరు: ఉద్యోగం వచ్చిందని నమ్మించి ఆన్‌లైన్‌లో డబ్బులు వేసుకుని జెండా ఎత్తేసిన సంఘటన చన్గోముల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుత్బుల్లాపూర్‌ గ్రామానికి చెందిన కొప్పుల హర్షితకు ఈ నెల 6న ఓ నంబర్‌తో కాల్‌ వచ్చింది. మీరు ఉద్యోగానికి ఎంపికయ్యారు ఇంటి వద్ద నుంచే జాబ్‌ చేయవచ్చని నమ్మబలికి ఆన్‌లైన్‌లో రూ.80 వేలు చెల్లించాలన్నారు. ఆఫర్‌లేటర్‌ ఇంటికి వస్తుందని చెప్పడంతో ఆమె నమ్మి ఆన్‌లైన్‌లో నగదును పంపింది. చివరికి మోసపోయానని గ్రహించి బాధ పడ్డారు. బాధితురాలి తండ్రి గోవర్ధన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్‌ పట్టివేత

కుల్కచర్ల: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కుల్కచర్ల ఎస్‌ఐ అన్వేష్‌ రెడ్డి హెచ్చరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అనంతసాగర్‌ గ్రామానికి చెందిన చిల్ల మహేశ్‌ బుధవారం రాత్రి సమయంలో తన ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తూ విధులు నిర్వహిస్తున్న పోలీసులకు ఎదురుపడ్డారు. అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నించగా లేవని చెప్పడంతో ట్రాక్టర్‌ను ఠాణాకు తరలించి అతనిపై కేసు నమోదు చేయడం జరిగిందని పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్‌ బోల్తా పడి డ్రైవర్‌ మృతి

తాండూరు రూరల్‌: ట్రాక్టర్‌ బోల్తాపడి ఓ డ్రైవర్‌ మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని నారాయణపూర్‌ గేటు వద్ద గురువారం రాత్రి చోటు చేసుకుంది. కరన్‌కోట్‌ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బషీరాబాద్‌ మండలం మంతట్టి గ్రామానికి చెందిన మల్లేశ్‌(35) ట్రాక్టర్‌తో తాండూరు వస్తున్నారు. మార్గమధ్యలో నారాయణపూర్‌ గేటు వద్ద అదుపుతప్పి ట్రాక్టర్‌ బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్‌ డ్రైవర్‌ అక్కడికక్కడే మృతి చెందారు. పూర్తి వివరాల తెలియాల్సి ఉందని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కనుల పండువగా శేషవాహన సేవ



పెరుగుబసంతాన్ని వీక్షిస్తున్న భక్తులు

యాలాల: మండలంలోని జుంటుపల్లి రామచంద్రా స్వామి ఆలయ బ్రహోత్సవాల్లో భాగంగా గురువారం శేషవాహన సేవ భక్తులను కనువిందు చేసింది. అంతకుముందు పెరుగుబసంతం కార్యక్రమాన్ని సైతం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు వివిధ కార్యక్రమాలను చేపట్టారు. చివరి రోజైన శుక్రవారం మహాలక్ష్మీపూజ, హరికథా కాలక్షేపం, అన్నదానం కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ చైర్మన్‌ హన్మంత్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, భక్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

మత రాజకీయాలను తిప్పి కొట్టాలి



సభలో ప్రసంగిస్తున్న ఎంపీ రంజిత్‌ రెడ్డి

- బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలి
- ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కుల్కచర్ల: మతాలు, దేవుళ్లను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేసే బీజేపీకి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని చేవేళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో పోలింగ్‌ బూత్‌ కార్యకర్తలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే ప్రస్తుతం కూడా కష్టపడి చేవేళ్లలో ఎంపీ స్థానాన్ని గెలిపించుకొని రాహుల్‌ గాంధీని ప్రధాని చేయాలన్నారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్‌ పార్టీ పోటీలో నామమాత్రంగా ఉందన్నారు. బీజేపీతోనే పోరాడుతున్న పరిస్థితిలో కాంగ్రెస్‌ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించాలని అన్నారు. ఆగస్టు 15 తేదీలోపు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌ రెడ్డి ప్రకటించిన విషయాన్ని కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పేర్కొన్నారు. ప్రజలేవరూ కూడా కరెంట్‌ బిల్లులు కట్టాల్సిన పనిలేదని, విద్యుత్‌ శాఖ అధికారులు బిల్లులు అని వస్తే మాకు ఫోన్లు చేయాలని సూచించారు. ఇప్పుడు కార్యకర్తలు కష్టపడితే స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలకు సర్పంచులు, ఎంపీటీసీలు, అయ్యేందుకు కృషి చేస్తామన్నారు. ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, పీఏసీఎస్‌ చైర్మన్‌ మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, బ్లాక్‌ టు అధ్యక్షుడు భరత్‌కుమార్‌, పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు, ఎంపీటీసీ ఆనందం, నాయకులు గోపాల్‌నాయక్‌, వెంకటయ్య, అంజిలయ్య, స్వామి, బచ్చిరెడ్డి, వెంకటేష్‌, భరత్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

పేలుడు పదార్థాల పట్టివేత

షాద్‌నగర్‌రూరల్‌: అనుమతులు లే కుండా బండరాళ్లు పగులగొడుతున్న వ్యక్తి నుంచి షాద్‌నగర్‌ పోలీసులు గురువారం పేలు డు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. సీఐ ప్రతాప్‌లింగం తెలిపిన ప్రకారం.. ఫరూఖ్‌నగర్‌ మండల పరిధిలోని బూర్గుల శివారులో గురువారం కొందరు అనుమతులు లేకుండా జిలెటెన్‌ స్టిక్స్‌ సాయంతో బండరాళ్లను పగలగొడుతున్నారు. విషయా న్ని తెలుసుకున్న డీఐ రామిరెడ్డి, కానిస్టేబుల్స్‌ సలీం, రాజు, యాదగిరి అక్కడికి వెళ్లి విచారించారు. అక్రమంగా బ్లాస్టింగ్‌ చేస్తున్న చింతగూ డ గ్రామానికి చెందిన వంగూరి యాదయ్యను అరెస్టు చేసినట్లు తెలిపారు. మహబూబ్‌నగర్‌ జిల్లా బాలానగర్‌కు చెందిన యాదయ్య, భ వానీ పరారీలో ఉన్నట్లు సీఐ తెలి పారు. నిందితుడి నుంచి 59 జిలెటిన్‌ స్టిక్స్‌ స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

పని చేయమన్నందుకు..

క్వారీలో దూకి యువకుడి ఆత్మహత్య



క్వారీలో నుంచి మృతదేహాన్ని బయటకు తీస్తున్న పోలీసులు

తాండూరు రూరల్‌: తల్లి మందలించిందని ఓ యువకుడు మనస్తాపం చెంది నాపరాతి క్వారీలో దూకి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని మల్కాపూర్‌ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. కరన్‌కోట్‌ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అక్కంపల్లి అంజిలప్ప(26) కొన్ని రోజులుగా పని చేయకుండా ఖాళీగా ఉంటున్నాడు. ఈ క్రమంలో తల్లి, సోదరి అతడిని మందలించారు. ఏదైన పని చేసుకోవాలని సూచించారు. దీంతో మనస్తాపం చెందిన అంజిలప్ప గురువారం గ్రామ శివారులో ఉన్న నాపరాతి క్వారీలో దూకి చనిపోయాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. కానిస్టేబుళ్లు ధన్‌రాజ్‌, ప్రతాప్‌లు క్వారీలో దిగి మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఆర్‌ఓ వాసుచంద్ర

పరిగి అసిస్టెంట్‌ రిటర్నింగ్‌ అధికారి వాసుచంద్ర

పరిగి: పార్లమెంట్‌ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా ఆయ పార్టీల నాయకులు, ఓటర్లు, అధికారులు సహకరించాలని పరిగి అసిస్టెంట్‌ రిటర్నింగ్‌ అధికారి వాసుచంద్ర కోరారు. గురువారం పట్టణ కేంద్రంలోని ఏఆర్‌ఓ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, పోలీసుల అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మొత్తం 305 పోలింగ్‌ బూత్‌లు ఉన్నాయన్నారు. ఎన్నికలకు అన్ని రకాల ఏర్పాట్లు చేశామన్నారు. చేవెళ్ల ఆర్‌ఓ కార్యాలయంలో నామినేషన్‌లను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్యలు లేకుండా ముందస్తుగానే చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి పోలింగ్‌ స్టేషన్‌ను పరిశీలించి అక్కడ ఏమైన సమస్యలు ఉంటే వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో మూడు బృందాలుగా ఏర్పాటు చేసి నిత్యం అధికారులు పర్యటిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలను తప్పకుండా పాటించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే పీఓలకు, ఏపీఓలకు శిక్షణ తరగతులు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో పరిగి సీఐ శ్రీనివాస్‌, తహసీల్దార్‌ ఆనంద్‌రావు, ఎస్సై సంతోష్‌కుమార్‌, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫైర్‌ సిబ్బంది

ఎఫ్‌ఎస్‌ఓ నాగార్జున ఆధ్వర్యంలో ప్రదర్శనలు

తాండూరు టౌన్‌: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తాండూరు ఫైర్‌ సేఫ్టీ ఆఫీసర్‌ నాగార్జున సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం యాలాల మండలం జక్కేపల్లి పరిధిలోని రాడికల్‌ ఆర్గానిక్‌ బయో కెమికల్‌ ఫ్యాక్టరీలో ఫైర్‌ సిబ్బంది ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. పరిశ్రమలో ప్రమాదం సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యలను ప్రదర్శనల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఎస్‌ఓ నాగార్జున మాట్లాడుతూ.. చిన్న నిప్పు రవ్వ పెను ప్రమాదానికి దారి తీస్తుందన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవిస్తే తప్పించుకునేందుకు అనుగుణంగా సేఫ్టీ పరికరాలను అందుబాటులో పెట్టుకోవాలన్నారు. వేసవి కాలంలో బీడీ, సిగరెట్‌ తాగి నిప్పుతో పాటు పడేయరాదన్నారు. పెట్రోల్‌ పంపుల వద్ద సెల్‌ఫోన్‌ను వినియోగించరాదన్నారు. కార్యక్రమంలో ఫైర్‌ సిబ్బంది నర్సింహులు, ఖాజా, శ్రీనాథ్‌ తదితరులు పాల్గొన్నారు.

'లింగ్వా స్కిల్‌'తో విద్యార్థులకు మేలు

రాష్ట్ర కౌన్సిల్‌ ఆఫ్‌ ఉన్నత విద్యా కార్యదర్శి ప్రొఫెసర్‌ శ్రీరామ్‌ వెంకటేశ్‌



మాట్లాడుతున్న ప్రొఫెసర్‌ శ్రీరామ్‌ వెంకటేశ్‌

మొయినాబాద్‌రూరల్‌: లింగ్వా స్కిల్‌ కేంద్రంతో విద్యార్థులకు నైపుణ్యం, ఉపాధి ఉద్యోగాలు లభిస్తాయని రాష్ట్ర కౌన్సిల్‌ ఆఫ్‌ ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్‌ శ్రీరామ్‌ వెంకటేశ్‌ అన్నారు. గురువారం మండల పరిధిలోని జేబీ ఎడ్యూకేషన్‌ సొసైటీ ఆవరణలో అసిస్‌మెంట్‌ లింగ్వా స్కిల్‌ పరీక్షా కేంద్రాన్ని కళాశాల కార్యదర్శి జేబీ కృష్ణారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ పరీక్షా కేంద్రం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా శ్రీరామ్‌వెంకటేశ్‌ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా లింగ్వా స్కిల్‌ పరీక్షా కేంద్రం జేబీ గ్రూప్‌ విద్యాసంస్థల్లో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. లింగ్వా స్కిల్‌ అనేది నాలుగు భాషా నైపుణ్యాలతో వేగవంతమైన పరీక్షతో ఇంగ్లిష్‌ సామర్థ్యం అందిస్తుందన్నారు. ఉద్యోగులు, వ్యాపార భాష గురించి తెలిసిన సంస్థల్లో నియామకానికి అత్యంత అనుకూలమైందని సూచించారు. ఈ లింగ్వా స్కిల్‌ జనరల్‌ రోజు వారి జీవితంలో ఉపయోగించే భాషను పరీక్షిస్తుందని చెప్పారు. అనంతరం భాస్కర ఎడ్యూకేషనల్‌ సొసైటీ కార్యదర్శి జేబీ కృష్ణారావు మాట్లాడుతూ.. జేబీ గ్రూప్‌ విద్యాసంస్థను వ్యవస్థాపక చైర్మన్‌ దివంగత జె.భాస్కర్‌రావు 1993లో స్థాపించారని తెలిపారు. సమావేశంలో కంట్రీ హెడ్‌ సౌత్‌ ఏసియా కేంబ్రిడ్జి ఇంగ్లిష్‌ అసిస్‌మెంట్‌ ఇండియా ప్రైవేట్‌ లిమిటెడ్‌ వ్యవస్థాపక డైరెక్టర్‌ పీకే అరుణాచలం, జేబీ ఈసీ డైరెక్టర్‌ సంజయ్‌, ప్రిన్సిపాల్‌ కృష్ణమాచారి, ఫార్మసీ ప్రిన్సిపాల్‌ శ్రీనివాస్‌రావు, సుమగ్న పట్నాయక్‌, యాదయ్య, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జలాలు అడుగంటి.. మేకలు కట్టేసి

ఊట చెలిమెలు, మోటబావులు, చేదుడు బావులు, చేతిపంపులు ఇలా తాగునీటి వనరులు కాలక్రమేణ కనుమరుగవుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటడం, నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రస్తుతం చేతిపంపులు ఉనికే లేకుండా పోతున్నాయి. ఫలితంగా నీటిని అందించాల్సిన పంపులు మేకలకు స్థావరాలుగా మారాయి. ఇదీ మండలంలోని రేగడిమైలారం గ్రామంలో చేతి పంపు దుస్థితి. – బొంరాస్‌పేట